జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం

- పారిశ్రామిక అభివృద్ధి దిశగా అడుగులు
- 11 అన్న క్యాంటీన్లు ప్రారంభం
- మంత్రి టిజి భరత్
- ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

మాట్లాడుతున్న మంత్రి టిజి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్ అన్నారు. ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో పారిశ్రామిక అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు జిల్లాలో 11 అన్న క్యాంటీన్లను శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. గురువారం కర్నూలు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో రాష్ట్ర మంత్రి టిజి.భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని పోలీసు గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి టిజి.భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పి జి.బిందు మాధవ్‌లతో కలిసి కవాతు వాహనం నుండి సాయుధ దళ పరిశీలన చేశారు. ఎఆర్, సివిల్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్, హోమ్ గార్డ్స్, ఫైర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్లాటూన్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. పెన్షన్ పెంపును చేపట్టి లబ్ధిదారులకు భరోసా కల్పించామన్నారు. ఉచిత ఇసుక విధానం అమలు చేసి పేదలకు అండగా నిలిచామన్నారు. పాఠశాలల్లో దాదాపుగా ఖాళీగా ఉన్న 26,000 పైగా టీచర్ పోస్టులను డిఎస్‌సి ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. విద్యా వైద్య రంగాలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. ఉపాధి నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ప్రభుత్వానికి మెరుగైన సేవలదించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను మంత్రి అందచేశారు. వేడుకల్లో కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ మధుసూదన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఎడిఫై ఇంగ్లీష్ మీడియం స్కూల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల (బాలికల), కెజిబివి, సిస్టర్ స్టానిస్లస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలకు చెందిన విద్యార్థులు చూపరులను ఆకట్టుకునే విధంగా దేశ భక్తి గీతాలు, జానపద గేయాల ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం ప్రదర్శన నిర్వహించిన విద్యార్థిని, విద్యార్థులకు మంత్రి, జిల్లాకలెక్టర్, ఎస్పి చేతులమీదుగా ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి టిజి, కలెక్టర్ రంజిత్ బాష, ఎస్పీ బిందు మాధవ్

గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి టిజి.భరత్

వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

కలెక్టరేట్‌లో జెండాను ఎగుర వేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ , ప్రైవేటు కార్యాలయాల్లో, పాఠశాలలు, కళాశాలలో విశ్వవిద్యాలయాల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి మువ్వన్నెల జెండాకు గౌరవ వందనం చేశారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో : జిల్లా పరిపాలన అధికారి, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి నవ్య జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు పాల్గొన్నారు.

రవీంద్ర విద్యాసంస్థల్లో : రవీంద్ర విద్యాసంస్థల్లో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో రవీంద్ర బాలికల పాఠశాలలో రవీంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ జి. పుల్లయ్య, రవీంద్ర ఐసి పాఠశాలలో అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్, రవీంద్ర విద్యానికేతన్ ప్రైమరీ విభాగంలో వైస్ చైర్మన్ జి.వంశీధర్ హైస్కూల్ విభాగానికి ప్రొఫెసర్ జి .శశికుమార్ , రిడ్జ్ స్కూల్లో సిఇఒ గోపీనాథ్, డీన్ రాజేంద్రన్ , రవీంద్ర గ్లోబల్ స్కూల్లో రవీంద్ర ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉష్షశ్రీ , జి పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సి. శ్రీనివాస రావు, రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కెఇ శ్రీనివాసమూర్తి, శ్రీకృష్ణ జూనియర్ కళాశాలలో హెచ్ఒడి జయలక్ష్మి, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ జ్యోతి, పతాకావిష్కరణ గావించారు.

రాయలసీమ వర్సిటీలో : రాయలసీమ యూనివర్సిటీలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్ ఎగురవేసి గౌరవ వందనం చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి వెంకటేశ్వర్లు, వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీలో : క్లస్టర్ యూనివర్సిటీలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వర్సిటీ వైస్ ఛాన్సలర్ సాయి గోపాల్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఇన్చార్జి రిజిస్ట్రా ర్ అక్తర్ భాను, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ వివి సుబ్రహ్మణ్య కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఐటీ డిఎం: నగర శివారులోని ట్రిబుల్ ఐటి డిఎం విద్యాసంస్థలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఇన్చార్జి రిజిస్ట్రార్ గురుమూర్తి, డాక్టర్ చంద్రశేఖర్ కల్యాార జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు.

టౌన్ మోడల్ కళాశాలలో: టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.కళాశాల ప్రిన్సిపల్ సి సుంకన్న మాజీ ప్రిన్సిపల్ డాక్టర్‌కె. చెన్నయ్య జాతీయ పతాకాన్ని ఎగరవేసి విద్యార్థులను నుండి గౌరవ వందనం స్వీకరించారు. 102 ఏళ్ల స్వాతంత్ర్య సమర యోధురాలు మద్దూరు చిన్నమ్మను సత్కరించారు.

కెవిఆర్ జూనియర్ కళాశాలలో : కెవిఆర్ బాలికల జూనియర్ కళాశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని కళాశాల ప్రిన్సిపల్ జి.లాలప్ప ఎగురవేసి వందనం చేశారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్ : భారతదేశ ప్రథమ స్వాంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహం వద్ద 17వ వార్డు కార్పొరేటర్ క్రైపా పద్మలత, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జోగి వెంకటరామిరెడ్డి, డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, అధ్యక్షుడు బి.విజయమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, ట్రెజరర్ రమణారెడ్డి, జాయింట్ సెక్రటరీ జితేంద్ర, సభ్యులు రామచంద్రారెడ్డి, నాగార్జున రెడ్డి, తిలక్, గోపాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ యూనివర్సిటీలో జెండాకు వందనం చేస్తున్న వీసీ

రవీంద్ర విద్యాసంస్థల్లో జెండాకు వందనం చేస్తున్న జి.పుల్లయ్య

ఆర్‌యులో జెండాకు వందనం చేస్తున్న వీసీ ఎన్‌టికె.నాయక్

వీరుల త్యాగఫలం నేటి స్వాతంత్ర్య దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో చేసిన పోరాటాలు, అమరవీరుల త్యాగాలకు ప్రతిఫలంగానే ఈ స్వాతంత్ర్య ఫలాలు లభించాయని నగర మేయర్ బివై. రామయ్య అన్నారు. గురువారం నగరపాలక కార్యాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా మేయర్ బివై. రామయ్య, కమిషనర్ పివి. రామలింగేశ్వర్ హాజరయ్యారు. ముందుగా స్వాతంత్ర్య సమర యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత జాతీయ జెండాను ఎగురవేసి, వేదికపై ప్రసంగించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు, సిబ్బందితో కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంఇలు షాకీర్, శేషసాయి, డిసిపి సంధ్య, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఒ జునైద్, ఇశ్రాయేలు, సెక్రటరీ నాగరాజు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో మాట్లాడుతున్న మేయర్ రామయ్య

పరేడ్ గ్రౌండ్‌లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

జిజిహెచ్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి

జి జి హెచ్ లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

తొలగిన కరెంటు కష్టాలు -ప్రారంభించిన డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ సర్వజన వైద్యశాల కర్నూలులో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో కరెంటు కష్టాలు తొలగిపోయాయని ఆసుపత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల 500 కెవిఎ సబ్‌స్టేషన్ యార్డ్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డా సి ప్రభాకర రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని 500 కెవిఎ సబ్‌స్టేషన్ యార్డ్‌ను క్రిటికల్ కేర్ బ్లాక్ , డయాగ్నొస్టిక్ బ్లాక్ వద్ద ఏర్పాటు చేసామన్నారు. దీనివలన కొత్తగా 3 ఎక్స్‌రే మిషన్లు ప్రారంభం చేసే అవకాశం కలిగిందన్నారు. సిటి స్కాన్, అల్ట్రా సౌండ్ బయో కెమికల్ పెథాలాజికల్ మిషన్లకు కరెంట్ ఫ్లక్షువేషన్ నుంచి విముక్తి కలిగిందన్నారు. ఈ సబ్‌స్టేషన్ యార్డ్ ఏర్పాటుతో హాస్పిటల్‌లోని అత్యవసర సేవలు నిరంతర విద్యుత్ సరఫరా ద్వారా బలోపేతం కానున్నాయని తెలిపారు. క్రిటికల్ కేర్ బ్లాక్, డయాగ్నొస్టిక్ బ్లాక్‌లలో ఉన్న అత్యాధునిక పరికరాలకు అడ్డంకి లేకుండా విద్యుత్ అందించడం కోసం ఈ సబ్‌స్టేషన్ అత్యంత ముఖ్యమైనదన్నారు. ఇక్కడి రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇది ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. సబ్‌స్టేషన్ ప్రారంభం తరువాత, హాస్పిటల్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం కలగనుందన్నారు. కర్నూలు జిల్లాలోని ఈ ప్రభుత్వ హాస్పిటల్‌లో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుందని తెలిపారు. హాస్పిటల్ సిబ్బంది , స్థానిక ప్రజలు ఈ సబ్‌స్టేషన్ ప్రారంభంపై సంతోషం వ్యక్తం చేశారు. డిప్యూటీ సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ హేమనలిని, ఎపిఎంఎస్ ఐ డిసి ఇఇ శివకుమార్, ఎఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఎఇ శివలింగం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేశంలో ప్రజలందరూ ఐక్యమత్యంతో మెలగాలి

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

కోడుమూరు సిపిఎం కార్యాలయంలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను సిపిఎంమండల కార్యదర్శి గఫూర్‌మియా అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షులు కనికె నాగిరెడ్డి జాతీయ జండాను ఆవిష్కరించారు.

ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ప్రతి ఒక్కరు మంచి విలువలతో ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జడ్‌పి చైర్మన్ పాపిరెడ్డి సూచించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్మన్ పాపిరెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టత ప్రాధాన్యత సమరయోధులు పోరాట విధానాలు వివరించారు. సిఇఒ నాసరరెడ్డి, జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు క్రైమ్ : కర్నూలు ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. మాజీ వైస్ ఎంపీపీ ధర్మవరం వాసు, సర్పంచి సాగర్, ఎంపిటిసిలు నెహమ్య, లక్ష్మన్న, పలువురు కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్:

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ కెజి. గంగాధర్ రెడ్డి ముందుగా గాడి చర్ల విగ్రహానికి పూలమాలవేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్రం కోసం అమరులైన త్యాగధనులను స్మరించుకున్నారు. గ్రంథాలయ కార్యదర్శి కె.ప్రకాష్, ఉపగ్రంథ పాలకురాలు వి. పెద్దక్క, సహాయ గ్రంథాలయాధికారి వజ్రాల గోవిందరెడ్డి. ఎస్.బాష, సుదర్శన్, ఈశ్వరమ్మ, ఉమ, శ్రీనివాసులు చంద్రమ్మ, నషీమా, రేణుక లైబ్రేరియన్స్ తదితర పాఠకులు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : ఓర్వకల్లు మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు పాఠశాలల్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎంపిపి తిప్పన్న ఎగురవేశారు. తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ఉపాధి హామీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని రిజర్వేశారు. టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఎంపిడిఒ నాగ శివప్రసాద్, ఎపిడి లక్ష్మన్న, ఎపిఒ సాయినాథ్, మండల విద్యాశాఖ అధికారి ఓంకార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీ య జెండాను ఎగురవేసి మాట్లాడుతున్న చైర్మన్

రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో

నన్నూరు ఎపి రైతు సంఘం , వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న ఎగురవేశారు. రైతు సంఘం మండల నాయకులు మధుసూదన్, మల్లేష్ మాసం భాస్కర్ స్వాములు పాల్గొన్నారు.

క్రిష్ణగిరిలో మాట్లాడుతున్న జడ్‌పిటిసి కెఇ.సుబాషిని

క్రిష్ణగిరి: ఎంతోమంది మహానుభావుల ప్రాణ త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం అని జడ్‌పిటిసి కెఇ.సుభాషిని తెలిపారు. క్రిష్ణగిరి మండలం పోతుగల్లు పంచాయతీ గుండ్లమల్లపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తి గేయాలను ఆలకించారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు.

ప్రజాశక్తి కార్యాలయంలో

కర్నూలు కార్పొరేషన్: కర్నూలు వీకర్‌సెక్షన్ కాలనీలోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో జాతీయ జెండాను జనరల్ మేనేజర్ యు.నరసింహ ఎగుర వేశారు. అనంతరం డెస్క్ ఇన్‌ఛార్జి పానుగంటి చంద్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యను యు.నరసింహ వివరించారు. కార్యక్రమంలో ఎడిషన్‌కమిటీ సభ్యులు ఎం.మంగయ్య, ఎం.రాజు, ఎస్ఎడిబాష, అక్కౌంటెంట్ జయలక్ష్మి, ప్రజాశక్తి బుక్‌హౌజ్ ఇన్‌చార్జి జి.మధు, అసబ్‌ఎడిటర్లు ఎం.అయ్యస్వామి, పి.మాసుం, పద్మ, సిబ్బంది ఎల్లాగౌడ్, రాము, జగదీశ్వర్‌గౌడ్,సుబ్బారాయుడు, మాసుం, నవీన్‌కుమార్, రాకేష్, ప్రవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవంపై సుబ్బరాముడు గానం ఆలపించారు.

కర్నూలు : కర్నూలు ఏ క్యాంపు మైపర్ ఫార్మసీ కళాశాలలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ఇందులో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాకు గౌరవవందనం చేసి విద్యార్థులకు సందేశమిచ్చారు. ఎంతోమంది త్యాగ ఫలితం ఈ స్వాతంత్రం అని దీనిని మనం ప్రతి ఒక్కరూ స్వాతంత్ర సమరయోధులను గుర్తు చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. రాబోయే కాలంలో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలన్నారు. అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్, ప్రిన్సిపల్ డాక్టర్ జయ రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కాసర్ల సురేష్, అకాడమిక్ డీన్ డాక్టర్ ఎం.రాజ్ కుమార్, ఎస్ఆర్‌పిసి, బిఇడి కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్, ఇతర అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

మైపర్ పార్మసీ కళాశాలలో జెండాకు వందనం చేస్తున్న డాక్టర్ సతీష్ తదితరులు

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో మాట్లాడుతున్న జిఎం యు.నరసింహా

నారాయణ స్కూలులో శాంతికపోతాన్ని ఎగురవేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

మట్టిలో మాణిక్యాలుగా తయారు కావాలి

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

విద్యార్థులు దుర్వ్యసనాలకు లోను కాకుండా భావి భారత పౌరులుగా, మట్టిలో మాణిక్యాల్లా తయారు కావాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి సూచించారు. యెల్కూరు బంగ్లాలోని నారాయణ పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఈసందర్భంగా శాంతికపోతాలను ఎగురవేశారు. విద్యార్థుల నుద్దేశించిమాట్లాడారు. చదువుతో ఈ సమాజాన్ని మార్చవచ్చని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగార్జున రెడ్డి, నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఎజిఎం రమేష్ కుమార్, ఆర్ఐ అన్వర్ బాషా, జిల్లా కో ఆర్డినేటర్స్ భాగ్యలక్ష్మి, శ్రీహరి, అకడమిక్ డీన్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిఎస్ఎన్ఎల్ జిఎం రమేష్

బిఎస్ఎన్ఎల్ 4జి సేవలను ఆదరించండి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలు బిఎస్ఎన్ఎల్ భవన్ కార్యాలయంలో కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి.రమేష్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఎంతోమంది మహానుభావుల త్యాగ ఫలితంగా వచ్చిన స్వాతంత్ర్యం తరువాత భారతదేశ టెలికాం రంగ అభివృద్ధిలో ఏకైక ప్రజారంగ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్ విశేషమైన కృషి చేస్తున్నదని తెలిపారు. ఎటువంటి సెక్యూరిటీ పరమైన సమస్యలు లేకుండా అతి తక్కువ ధరల్లో అందిస్తున్న 4జి సేవలను ఆందిస్తున్నామని తెలిపారు. త్వరగా 4జి సిమ్‌ను అప్‌డేట్ చేసుకుని అంతరాయం లేని మొబైల్ సర్వీస్ లను పొందాలని జనరల్ మేనేజర్ ప్రజలను కోరారు. టెలికాం రీక్రియేషన్ క్లబ్ సెక్రటరీ విజయ కుమార్ ఆధ్వర్యంలో క్రీడలు , కళా రంగాలలో నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులను జిఎం జి రమేష్ అందజేశారు. బిఎస్ఎన్ఎల్ డిజిఎం రాజేశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే చెప్పేవన్నీ అబద్ధాలే : మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు
- మీనాక్షి నాయుడు నైజం ఒంటెద్దు పోకడ : ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య విభేదాలు వేడెక్కాయి. ఒకరికిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటూ రచ్చకెక్కారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేదికగా అధికార కూటమి పార్టీలో విభేదాలు బహిర్గతమయ్యాయి. గురువారం టిడిపి కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తీరుపై మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే పార్థసారథి తీరు వల్ల టిడిపి కార్యకర్తలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా ఆదోనిలో అసలు తాము అధికారంలో ఉన్నామో లేదో అని అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదోని అభివృద్ధిపై ఎమ్మెల్యే పార్థసారథి అసెంబ్లీ సాక్షిగా, మున్సిపల్ కార్యాలయంలో ఇటీవల జరిగిన ప్రెస్ మీట్‌లో అన్ని అబద్ధాలే చెప్పారని, ఇలా చెప్పి ప్రజలను అయోమయానికి గురి చేయడం తగదన్నారు. ఆదోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే చెప్పారని, విలేకరుల సమావేశంలో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి రూ.37 కోట్లు కేంద్రం మంజూరు చేసిందని ఎమ్మెల్యే పార్థసారథి ప్రకటించారని తెలిపారు. ఇదంతా అబద్ధమని, ఒక్క పైసా కూడా కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదని చెప్పారు. ఇంతటి అబద్ధాలు చెబుతున్న వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. అలాగే ఆ పార్టీ నుంచి అనేకమంది బిజెపిలో చేరుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఆదోనిలో టిడిపి కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఇక్కడ జరుగుతున్న అన్ని విషయాలను పార్టీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పార్టీ ప్రధాన నాయకులు సంయమనం పాటించాలని చెప్పడంతోనే ఓపికతో ఉన్నామని చెప్పారు.

గ్రూపులకతీతంగా అందరూ కావాలి
- ఎమ్మెల్యే పార్థసారథి

టిడిపిలో ఐదు గ్రూపులు ఉండడం వల్లే సమస్య వచ్చిందని, టిడిపి కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వబోమని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. ఎన్నికల్లో తన గెలుపు కోసం టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారని చెప్పారు. తనకు అబద్ధాలు చెప్పాల్సిన అవసరం లేదని, తాను అంతా అసెంబ్లీలో ఆన్ రికార్డులోనే చెప్పానని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తనపై ఎందుకు ఆరోపించారో అర్థం కావడం లేదని తెలిపారు. తాను ఎన్నడూ ఒంటెద్దు పోకడలకు పోలేదని, ఒంటెద్దు పోకడలు చేస్తున్నది మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడని చెప్పారు. టిడిపిలో ఐదు గ్రూపులు ఉన్నాయని, అందరూ తన గెలుపు కోసం పనిచేశారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాత్రం తాను ఒక్కడే టిడిపి అని, తానే అంతా అని చెబుతున్నారని ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. తన గెలుపు కోసం పని చేసిన ఇతరులు ఇలాగే తన ప్రశ్నిస్తే ఎలా అని, వారు కూడా మొండికేసి ప్రశ్నిస్తే ఎవరు సమాధానం చెప్పాలని అసహనం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు కార్యకర్తలను రెచ్చగొట్టడం తగదన్నారు. ఆదోనిలో ఎప్పటి నుంచో ఉన్న 60-40 విధానానికి తాను వ్యతిరేకమన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 2 నెలలయినా పదవుల కేటాయింపులు ఆలస్యం కావడానికి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు కారణమన్నారు. తాను ఇంతవరకు 70 శాతం లేఖలు టిడిపి వారికి సిఫారసు చేయడానికి ఇచ్చానన్నారు. తాను టిడిపి ఆదోని ఇన్‌ఛార్జ్ పదవి కోసం ఎవరినీ సిఫార్సు చేయలేదని తెలిపారు. తన గెలుపు కోసం అందరూ కృషి చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు చెప్పానన్నారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

అభివృద్ధిలో పోటీ పడదాం

- ఎమ్మెల్యే విరుపాక్షి, సర్పంచి దాసరి గోవిందరాజులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి అభివృద్ధిలో పార్టీలకతీతంగా పోటీ పడాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, స్థానిక సర్పంచి దాసరి గోవిందరాజులు కోరారు. గురువారం చిప్పగిరి సచివాలయంలో సర్పంచి దాసరి గోవిందు రాజులు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి సురేంద్ర ఆధ్వర్యంలో అస్ప్రెషనల్ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విరుపాక్షి, ఎంపిపి జూటూరు హేమలత హాజరయ్యారు. ముందుగా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిప్పగిరిలో సిసి రోడ్లు, నీటి వసతికి అధిక నిధులను వెచ్చించి పరిష్కరిస్తామని తెలిపారు. నిరుపేదలకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించాలని కోరారు. ఎంపిడిఒ సివి.కొండయ్య, ఉప సర్పంచి పెద్ద పెద్దయ్య, ఎంపిటిసి రజిని, టిడిపి నాయకులు కరి గోవిందు, జనార్ధన స్వామి, వైసిపి నాయకులు ధర్మేంద్ర పాల్గొన్నారు.

దశమి ఉత్సవాల్లో అపశ్రుతి

- 16 మందికి గాయాలు

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మండలంలోని తంగరడోన గ్రామంలో చింతలముని, నల్లా రెడ్డి స్వాముల దశమి ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. గురువారం తెల్లవారుజామున 4 గంటలకు చింతలముని స్వామి గుడి ముందు బాణసంచా కాలుస్తూ ఉండగా పక్కనే ఉన్న బాణసంచా సామగ్రిలోకి నిప్పు రవ్వ పడడంతో మంటలు ఎగిసి పడి పక్కనున్న భక్తులపై నిప్పురవ్వలు పడ్డాయి. దీంతో 16 మంది భక్తులకు గాయాలయ్యాయి. రాయచూర్ జిల్లా బడెప్ప దీన్నే మండలం బైలు పత్తికొండ గ్రామానికి చెందిన కురువ లింగయ్య, రాయచూర్ జిల్లా మంచుల పురానికి చెందిన అకుల్, పుష్పవతి, రంజిత్ కుమార్, అలంపూర్ గద్వాల జిల్లా సలకల కొండ గ్రామానికి చెందిన గోవిందమ్మ, నరసమ్మ, తేజస్విని, ఉరుకుందు, తెలుగు ఈరన్న, పెరుమాల మంజునాథ్, తుగ్గలి మండలం రాంపురం గ్రామానికి చెందిన మిద్దె చంద్ర, ఎమ్మిగనూరు మండలం బైలుప్పల గ్రామానికి చెందిన కుంతీదేవి, ఆస్పరి మండలం తంగరడోన గ్రామానికి చెందిన శ్రీనివాసులు, హరిజన ఈరన్నకు గాయాలయ్యాయి. వీరిని వెంటనే ఆటోలో ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాయచూర్ భక్తులు రాయచూర్‌లోనే చికిత్స తీసుకుంటామని వెళ్లినట్లు సిఐ మస్తాన్ వలీ తెలిపారు. కురువ లింగయ్య ఫిర్యాదు మేరకు ఆలయ ఛైర్మన్ పార్వతి, సీతారాం రెడ్డి, కమిటీ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బడుగుల కడుపు నింపుతున్న చంద్రబాబు

- టిడిపి మండల అధ్యక్షులు వెంకటేష్ స్వామి

ప్రజాశక్తి - మంత్రాలయం

పాలాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

'అన్న క్యాంటీన్ల' ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల కడుపు నింపుతున్నారని టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి తెలిపారు. గురువారం అన్న క్యాంటీన్లను ప్రారంభించిన నేపథ్యంలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు రాఘవేంద్ర సర్కిల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, విద్యా కమిటీ ఛైర్మన్ గనికంటి గురురాజ్, వైస్ ఛైర్మన్ వనికే నాగరాజు, నాయకులు వట్టెప్ప నరసింహ, ఏబు, చిన్న సుంకప్ప, హండే హనుమంతు, చెట్నిహళ్లి తిక్కస్వామి గౌడ్, సున్నం రఘు, సున్నం రామకృష్ణ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. 50 మంది బాలబాలికలకు నోటు బుక్కులు, పెన్నులు, మిఠాయిలు పంచిపెట్టారు. లయన్స్ క్లబ్ పట్టణ కార్యదర్శి వంకదారు శ్రీనాథ్ గుప్తా, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మారెడ్డి, నాయకంటి రఘు, జిల్లా ఛైర్మన్ దేవరశెట్టి ప్రసాద్ రావు, స్కూలు ప్రధానోపాధ్యాయులు దామోదర్ పాల్గొన్నారు.

పిహెచ్‌సి అభివృద్ధికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి- దేవనకొండ

రోగుల బెడ్లను పరిశీలిస్తున్న ఎంపిపి లక్ష్మీదేవి

దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపిపి లక్ష్మీదేవి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వైద్యాధికారులు విజయభాస్కర్, కల్యాణ్, చంద్రశేఖర్ విజ్ఞప్తి మేరకు రోగుల బెడ్లను పరిశీలించారు. రోగుల బెడ్లు పాడైపోయాయని, ల్యాబ్ టెక్నీషియన్ గది చిన్నగా ఉండడంతో రక్త పరీక్షలు చేసేందుకు ఇబ్బందిగా ఉందని వైద్యాధికారులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎంపిపి జనరల్ ఫండ్ కింద నిధులు కేటాయించి రోగులకు కొత్త బెడ్లు, రక్త పరీక్షల గది విస్తరణకు కృషి చేస్తానని తెలిపారు. ఎంపిడిఒ గౌరీ దేవి, ఇఒఆర్‌డి సూర్యనారాయణ, ఎంపిపి భర్త లుముంబా, జడ్‌పిటిసి కిట్టు, హెల్త్ సూపర్‌వైజర్లు రంగస్వామి, హనుమంతమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు పరిశీలించారు. గురువారం స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో చేపట్టిన పనుల పురోగతిని ఇఇ సురేష్ కోనాపూర్‌ను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని, చుట్టూ ఉన్న కట్టను కుదించి నూతనంగా మండపంలో నాలుగు దిక్కులకు రాఘవేంద్రస్వామి విగ్రహాలను ఏర్పాటు చేయడం, పైన బంగారు తొడుగులు ఏర్పాటు చేసే చర్యలు చేపట్టిన క్రమంలో పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు సిఆర్ఒ ఆఫీసు పక్కన పార్కుతో పాటు విద్యుద్దీపాలను ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న వివిధ రాజకీయ పార్టీల జెండా కట్టలను తొలగించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పనులను పరిశీలిస్తున్న పీఠాధిపతులు

కార్మికుల సేవలు వెల కట్టలేనివి

- సర్పంచి అరుణా దేవి

ప్రజాశక్తి - ఆలూరు

కార్మికులను సన్మానిస్తున్న సర్పంచి

ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా కాపాడుతున్న పంచాయతీ కార్మికుల సేవలు వెల కట్టలేనివని ఆలూరు సర్పంచి అరుణా దేవి, టిడిపి అధికార ప్రతినిధి, సపోర్ట్ ఫర్ సొసైటీ అధ్యక్షులు బెంగళూర్ కిషోర్ తెలిపారు. గురువారం పంచాయితీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బంది, కార్మికులతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. ఆలూరులోని 55 మంది పంచాయతీ కార్మికులకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. అనంతరం కార్మికులు కుటుంబ సభ్యులతో కలిసి పండగ చేసుకొనేందుకు బియ్యం, కందిబ్యాళ్లు, సోజీ, మైదా పిండి, నూనె, బెల్లం అందజేశారు. టిడిపి నాయకులు కమ్మరచేడు మద్దిలేటి పాల్గొన్నారు.

18న రాష్ట్ర సదస్సు

- ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్

ప్రజాశక్తి - కౌతాళం

ఈనెల 18న కర్నూలులో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్ కోరారు. గురువారం కౌతాళంలో ఆవాజ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చాక ముస్లిం, మైనార్టీలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డ్ చట్టాన్ని సవరిస్తూ పార్లమెంట్‌లో 40 ప్రతిపాదనలు ప్రవేశపెట్టిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సవరణ బిల్లుతో అన్య మతస్తులను వక్ఫ్‌బోర్డులో పెట్టడం వల్ల లక్ష్యం నీరుగారు తుందని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా ముస్లిం, మైనార్టీల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కర్నూలు నగరంలోని గుర్రం జాషువా విశ్వ విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జనసంద్రమైన ఉరుకుంద

ప్రజాశక్తి - కౌతాళం

శ్రావణమాసం ఉత్సవాల్లో భాగంగా శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న క్షేత్రం జనసంద్రమైంది. గురువారం వేల సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. ఆంధ్ర నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు బుధవారం రాత్రికి ఉరుకుందకు చేరుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవాలయ డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్, ఫెస్టివల్ అండ్ జ్యువెలర్స్ అధికారి పాండురంగ రెడ్డి, దేవాలయ సిబ్బంది గురువారం తెల్లవారుజాము నుంచి భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తుంగభద్ర దిగువ కాలువలో స్నానాలు ఆచరించి తడి గుడ్డలతోనే స్వామికి ఇష్టమైన నైవేద్యాలు వండి పెట్టారు. ఈరన్న స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. టికెట్ల కౌంటర్ల వద్ద, అన్నదాన సత్రం వద్ద, దర్శనం క్యూ లైన్‌లో భక్తులు బారులు తీరారు. భక్తుల సౌకర్యం కోసం రాయచూర్, సిరుగుప్ప, ఆదోని, ఎమ్మిగనూరు నుంచి ప్రత్యేక బస్సులను నడిపించారు. ఎలాంటి సంఘటనలూ జరగకుండా సిఐ మంజునాథ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మహారాజ శ్రీ కర్నూలు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.1145/2022
జి.అమ్మిరెడ్డి .... వాది
-ఎదురి-
పి.హరికృష్ణ ... ప్రతివాది
ప్రతివాదికి సమన్లు
పి.హరికృష్ణ తండ్రి పి.శివన్న, వయస్సు 52 సం., వ్యాపారం, ఇంటి.నెం.49-50ఎ-60, మద్దూర్‌నగర్, కర్నూలు సిటి మరియు జిల్లా.
పై నెంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తం ఇందుపైన ముందు వడ్డీ, కోర్టు ఖర్చులు రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది అయిన నీకు కోర్టు నుండి పలుమార్లు సమన్లు పంపినను మీకు చేరనందున కోర్టువారు ఈ పత్రిక ద్వా రా సమన్లు తెలుపమని ఉత్తర్వులు జారిచేశారు. కావున ప్రతివాది అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 03-09-2024 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 03-09-2024
యం.మోహన్‌రెడ్డి
వాది పరం అడ్వకేటు, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం. 1304/2022
జి.శ్రీరాములు .... వాది
-ఎదురి-
కె.రాజవర్ధన్‌రెడ్డి ... ప్రతివాది
ప్రతివాదికి దావా సమన్లు
కె.రాజవర్ధన్‌రెడ్డి తండ్రి కె.రామచంద్రరెడ్డి, వ్యాపారం, నివాసం. పర్ల గ్రామం కల్లూరు మండలం, కర్నూలు జిల్లా.
పై నంబరు దావాలో వాది ప్రతివాదిపైన తనకు రావలసిన ప్రామిసరినోటు బాకీ బాపత్తు రూ.5,09,129/-లు అసలు వడ్డీ కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 18-9-2024 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 18-9-2024
బి.చంద్రుడు,
యం.సి.మద్దిలేటి,
వాది పరం అడ్వకేట్లు,
కర్నూలు.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE : KURNOOL
O.S. No.318/ 2023
S. Venkateswarlu S/o. S. Venkataiah, ... Petitioner
-Vs-
1. M.LakshmiNirmala W/o. Ramachandra Reddy,
2. M.Sravani D/o. Ramachandra Reddy,
3. M. Jyothi D/o. Ramachandra Reddy,
All are R/o. HNo.45-24K-15-5A,
Ameen Abbas Nagar, Kurnool District.
... Respondents
SUMMONS TO DEFENDANTS NO. 2 AND 3
2. M. Sravani D/o. Ramachandra Reddy, aged about 25 years,
3. M. Jyothi D/o. Ramachandra Reddy, aged about 23 years,
All are R/o. H.No.45-24K-15-5A,
Ameen Abbas Nagar, Kurnool District.
Please take summons that the above plaintiff have filed above suit against you no.2 and 3 for recovery of Rs.6,23,400/- with future interest @36% per annum basing on the promissory note. In spite of summons through court and registered post you are avoiding the same. Hence this summons. You hould appear before the Hon ble court on 04.09.2024 by 10:30 am either in person or through advocate; otherwise the matter will be decided in o"absence.
By Order
S.SIVA RAMA KRISHNA PRASAD,
S.J.SHAREEF,
Advocate for Plaintiff,
Kurnool.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఎగురవేశారు. తహశీల్దార్ శివ రాముడు ఉన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ ఛైర్మన్ శాంతలు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్, కౌన్సిలర్లు బాలాజీ, చలపతి, రాజేశ్వర్ రెడ్డి, లలితమ్మ, సురేష్, చిన్న ఇంతియాజ్, వసీం, ఫయాజ్, మేనేజర్ అస్లాం బాష, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, టిపిఆర్ఒ శ్రీనివాసులు, నాయకులు మధుసూదన్ శర్మ, వీరేష్, ఉపేంద్ర, మహదేవ్ ఉన్నారు. అలాగే అమరావతి ఇంటర్నేషనల్ పాఠశాలలో స్థాపకులు రామలింగప్పతో కలిసి ఫుడ్ కమిషన్ మాజీ సభ్యులు గుడిసె ఆది కృష్ణమ్మ జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం దేశభక్తి గేయాలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పోటీ పరీక్షల్లో విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి, కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ఆదోని డీఎస్పీ కార్యాలయ ఆవరణలో డీఎస్పీ సోమన్న జాతీయ జెండాను ఎగురవేశారు. అంతకుముందు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో గార్డ్స్ ఆయనకు వందనం చేశారు. ఆదోనిలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ జాతీయ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ ధోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ రావు, పట్టణ అధ్యక్షులు సాయినాథ్, రామకృష్ణా రెడ్డి, శ్రీనిత్, మండల అధ్యక్షులు మోహన్ రెడ్డి, ఉమ్మి యూసుఫ్, సీనియర్ నాయకులు తాయన్న, ఎజాజ్ అహ్మద్, ఫరూక్ బాష, చేతన్ ధోకా, హనుమంతు, రామన్న యాదవ్, నూర్ బాష, నాగరాజ్ యాదవ్, సురేంద్ర యాదవ్, జయన్న పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లోని మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలలో, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి జాతీయ జెండాను ఎగుర వేశారు. అనంతరం మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ రకాల వేషధారణతో అలకరించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శేషఫణి జాతీయ జెండాను ఎగురవేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గొల్ల కేశన్న, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ రఘు, వ్యవసాయ కార్యాలయంలో ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, పట్టణ పోలీసు స్టేషన్‌లో సిఐ సుదర్శన్ రెడ్డి, గ్రామీణ పోలీసు స్టేషన్‌లో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మి జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాల, రావూస్ డిగ్రీ కళాశాలలో సిఇఒ తిరుమలరెడ్డి అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. దీక్ష, రావూస్ సిఇఒ సుజనా రెడ్డి, ప్రిన్సిపల్స్ ఇర్ఫాన్, మద్దిలేటి, రావూస్ నోడల్ ఆఫీసర్ శ్రుతి ప్రియ, దీక్ష అకాడమిక్ డైరెక్టర్ శివ పాల్గొన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో పట్టణంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో సంఘం తరపున జర్నలిస్టులు ఇండియన్ ఫ్లాగ్ స్టిక్కరింగ్ కార్యక్రమం నిర్వహించారు. మద్దతుగా ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఆదోని సీనియర్ అడ్వకేట్ సావిత్రి సందర్శించి, అభినందించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ తాలూకా అధ్యక్షులు షబ్బీర్, గౌరవాధ్యక్షులు ప్రజాశక్తి దేవేంద్ర మూర్తి, ఉపాధ్యక్షులు ఎరుకల వెంకటేష్, సెక్రటరీ దేవీప్రసాద్, ట్రెజరరీ ఖాదర్ బేగ్, విలేకరులు ఇలియాస్, మురళీ, మోశేష్, మునీర్, సురేంద్ర, సోషల్ వర్కర్ గ్రందే గిరి, టివి9 రామకృష్ణ, మీ వాదం పత్రిక ఛైర్మన్ అబ్దుల్ రజాక్, సాక్షి నాగరాజ్, బి.శ్రీనివాసులు నాయుడు, రవి, ఈరన్న, ఆర్‌పిఎస్‌ఎఫ్ నాయకులు షాహిద్ అఫ్రిది, ఆర్‌యుఎస్‌ఎఫ్ నాయకులు సావిడి రఘు, నవీన్, మహబూబ్ కలాం, నాయుడు, తాహెర్, రాజేష్, షేక్షా, రాజేష్, షాహీద్, అబ్దుల్, సుభాన్, ఉదయ్ సోషల్ వర్కర్ గుడికల్ రఫిక్ పాల్గొన్నారు. **చిప్పగిరి** తహశీల్దార్ కార్యాలయం, మండల కార్యాలయం, పోలీసు స్టేషన్, చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, ప్రభుత్వాస్పత్రి, సచివాలయంలో జెండాను ఎగురవేశారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, ఎంపిపి జూటూరు హేమలత, ఇన్‌ఛార్జీ తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఎంపిడిఒ సివి.కొండయ్య, ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, ఉప సర్పంచి పెద్ద పెద్దయ్య, ఎంపిటిసి సుమలత, ఎంఇఒ సావిత్రమ్మ, ఎపిఒ మాధవ శంకర్, పరిపాలన అధికారి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ మధు స్వామి పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టిడిపి నియోజకవర్గ నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. అంతకుముందు పాఠశాల చేరుకున్న ఆయనకు ప్రధానోపాధ్యాయులు హంపయ్య విద్యార్థులతో కలిసి పూలమాల వేసి స్వాగతం పలికారు. టిడిపి సీనియర్ నాయకులు అశోక్ రెడ్డి, పట్టణ ఇన్‌ఛార్జీ వరదరాజులు, విద్యాకమిటీ ఛైర్మన్ మద్రి నరసింహ, నాయకులు నరసింహ, పేతూరు పాల్గొన్నారు. **కౌతాళం** ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అమ్రేష్, ఎంపిడిఒ సుబ్బరాజు, వైస్ ఎంపిపి బుజ్జిస్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి పాల్ దినకరన్, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ మల్లికార్జున స్వామి, పోలీసు స్టేషన్‌లో సిఐ మంజునాథ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, ఛైర్మన్ బసవరాజు, ప్రతిభ హైస్కూల్‌లో కెనరా బ్యాంక్ మేనేజర్ సద్దాం అలీ, కరస్పాండెంట్ సయ్యదూద్ బాష, మదీనా మజీద్ వద్ద తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్ జాతీయ జెండాను ఎగుర వేశారు. **దేవనకొండ** పోలీసు స్టేషన్‌లో సిఐ శ్రీనివాసులు, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి లక్ష్మీదేవి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్, ఎఫ్ఆర్ హై స్కూల్‌లో ఎంఇఒ నిర్మల, రెయిన్‌బో పాఠశాలలో కరస్పాండెంట్ అల్లీపీరా, విబిఆర్ స్కూల్‌లో కరస్పాండెంట్ సుభాన్, సరస్వతి విద్యానికేతన్‌లో కరస్పాండెంట్లు కృష్ణమూర్తి, ముజీపూర్, జ్ఞాన సుధా స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వర్, కరస్పాండెంట్ సుధాకర్ జాతీయ జెండాను ఎగురవేశారు. **గోనెగండ్ల** ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి నసురుద్దీన్, ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ కుమారస్వామి, ఆయా పాఠశాలల స్కూల్ కమిటీ ఛైర్మన్లు, షేక్ గౌస్, రాంపురం రంజాన్, కె.వీరస్వామి, ఎం.రమేష్ జాతీయ జెండాను ఎగుర వేశారు. గోనెగండ్ల ప్రభుత్వ వైద్యశాల వద్ద స్టాఫ్ నర్స్ లక్ష్మీనరసమ్మ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ కార్తీక్ జెండా ఆవిష్కరణ చేశారు. **హోళగుంద** తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ప్రసాద్ రాజు, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ పెద్దయ్య నాయుడు జెండాను ఎగురవేశారు. **ఆస్పరి** పోలీసు స్టేషన్‌లో సిఐ మస్తాన్ వలీ, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శివశంకర్ నాయక్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉమాదేవి, ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్ బాలకృష్ణ, సచివాలయంలో సర్పంచి రాధమ్మ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సమీర, విజేత పాఠశాలలో కరస్పాండెంట్ మల్లేష్, ధనలక్ష్మి, నారాయణ ప్రైమ్ స్కూల్‌లో కరస్పాండెంట్ నరేష్ ఆచారి, నోబుల్ స్కూల్‌లో హెచ్‌ఎం చంద్రశేఖర్, సద్గురు స్కూల్‌లో కరస్పాండెంట్ బసవరాజు జాతీయ జెండాను ఎగురవేశారు. **పెద్దకడబూరు** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు అయ్యప్ప రెడ్డి గారి వెంకటరెడ్డి వారసులను సర్పంచి రామాంజనేయులు సన్మానించారు. డిప్యూటీ తహశీల్దార్ మహేష్, ఎంపిపి శ్రీవిద్య, నరవ శశిరేఖ, సర్పంచి రామాంజనేయులు, టిడిపి నాయకులు నరవ రమాకాంత రెడ్డి, మల్లికార్జున, ఏసేపు, వైసిపి నాయకులు రామ్మోహన్ రెడ్డి, విజయేంద్ర రెడ్డి, ముక్కరన్న, అర్లప్ప, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఛైర్మన్ స్వామి రాజు, టిడిపి నాయకులు ఆశీర్వాదం పాల్గొన్నారు. పెద్దకడబూరులోని అంబేద్కర్ విగ్రహం దగ్గర డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దాస్, బాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు విల్సన్, అశోక్, యువరాజు పాల్గొన్నారు.

ఆదోనిలో జెండాను ఎగుర వేస్తున్న సబ్ కలెక్టర్

గోనెగండ్లలో...

చిప్పగిరిలో జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి, ఎంపిపి హేమలత

ఎమ్మిగనూరులో బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే బీవీ

కౌతాళం ప్రతిభ పాఠశాలలో

ప్రశంసా పత్రం అందుకుంటున్న ఇఒఆర్‌డి బాలన్న

సంతోషంగా ఉంది

- ఇన్‌ఛార్జీ ఇఒఆర్‌డి బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్, కలెక్టర్ రంజిత్ బాష, ఎస్పీ బిందు మాధవ్ చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రం పొందడం సంతోషంగా ఉందని ఇన్‌ఛార్జీ ఇఒఆర్‌డి బాలన్న తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. ఉత్తమ ప్రశంసా పత్రం పొందడం వల్ల మరింత పట్టుదలతో విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు. ప్రశంసా పత్రం పొందిన వారిలో హౌసింగ్ అధికారి భవ్య, వెలుగు సిసి రాధమ్మ ఉన్నారు.

ఆదోని : ప్రశంసా పత్రం అందుకుంటున్న సురేష్‌బాబు

ఆదోనిరూరల్ : పట్టణంలోని లేబర్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్ బాబు ప్రశంసా పత్రం అందుకున్నారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కర్నూలు నగరంలో పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్, కలెక్టర్ రంజిత్ బాష, ఎస్పీ బిందు మాధవ్ సమక్షంలో అవార్డు అందుకున్నారు. **హాలహర్వి** మండలం కొక్కరచేడు లైన్‌మేన్ రంగప్ప మంత్రి టిజి.భరత్, కలెక్టర్ రంజిత్ బాష చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అలాగే డివిజన్ జెఇగా విధులు నిర్వహిస్తున్న విజయ కుమారి అవార్డు అందుకున్నారు.

హాలహర్వి : అవార్డు అందుకున్న అధికారులు

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం.304/2022 ఇన్
ఓ.యస్.నెం. 1304/2022
జి.శ్రీరాములు .... అర్జీదారు/వాది
-ఎదురి-
కె.రాజవర్ధన్‌రెడ్డి ... రెస్పాండెంటు/ప్రతివాది
రెస్పాండెంటు నోటీసులు
కె.సుధారాణి భర్త డి.రాఘవ్, ఇంటి.నెం.18-97,కొత్తపేట, కోడుమూరు గ్రామం మరియు మండలం, కర్నూలు జిల్లా.
పై నంబరు దావాలో వాది, ప్రతివాదిపైన దావా షెడ్యూలు దాఖలా ఆస్తి లో ప్రతివాది / రెస్పాండెంటు గాని ఎలాంటి అన్యాక్రాంతములు చేయకుండా దావా తీర్మానం అయ్యేంతవరకు అటాచ్‌మెంటు బిఫోర్ జడ్జిమెంటు ఉత్తర్వు ఇప్పించమని కోరుతూ అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో రెస్పాండెంటు / ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 18-9-2024 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
షెడ్యూలు :
రెస్పాండెంటు/ప్రతివాది ఆస్తి వివరము
కర్నూలు జిల్లా, కల్లూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, కల్లూరు మండలం, పర్ల గ్రామం,
సర్వే.నెం.497/2 పైకి యక.6.68 సెంట్లు.
తూర్పు : గిడ్డయ్యగారి గిడ్డయ్య భూమి.
పడమర : కల్లపర్రి చిన్ననాగేలి భూమి
ఉత్తరం : బుగ్గాల మద్దిలేటి భూమి,
దక్షిణం : మాదిగ మద్దిలేటి భూమి మరియు వంక.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 18-9-2024
బి.చంద్రుడు,
యం.సి.మద్దిలేటి,
వాది పరం అడ్వకేట్లు,
కర్నూలు.